సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

బాక్సర్లకు అభినందనలు



బాక్సర్లకు సర్టిఫికెట్‌లు ఇస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్

మల్కాపురం: ఇటీవల నగరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ చాంపియన్ పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిన్నారులు ప్రతిభ చూపారు. వీరిని 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కులో సోమవారం కార్పొరేటర్ పి.వి.సురేష్ అభినందించారు. మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నుంచి పారిశ్రామిక ప్రాంతానికి చెందిన చిన్నారులు పోటీల్లో ప్రతిభ చూపడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి మూడు వినతులను జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి మూడు వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, ఏపీడీవో కృపానందం, పాల్గొన్నారు.

పైసావాల షూటింగ్ ప్రారంభం



క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మల్కాపురం: నవీన్ తేజస్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన పైసా వాల చిత్రానికి సంబంధించిన ముహూర్తపు షాటుకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పైసా వాల చిత్రం దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసుకోని ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో యూనిట్ ప్రతినిధులతో పాటు నటీనటులు నూనెల పైడిరాజు,పి.వి.ఎస్.ఎన్.రాజు,ఇంకోటి వెంకటేశ్వరరావు(నాని)ఈ.వి.ఆర్ నీమేష్,అఖిల్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల లెక్కల్లో అవకతవకలు అవాస్తవం

- గోపాలపట్నం సీఐ ప్రభాకర్



గోపాలపట్నం: మద్యం సీసాల్లో అవకతవకలు చేశారని వాట్సాప్‌లో వస్తున్న వదంతులు అవాస్తవమని గోపాలపట్నం సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న ఇందిరానగర్, లక్ష్మీనగర్‌లో కార్డన్‌సెర్చ్ చేపట్టామన్నారు. అందులో భాగంగా రెండు బెల్టు షాపుల్లో 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. అయితే ఇందులో స్టేషన్ రైటర్ చేతి వాటం ప్రదర్శించారన్న కోణంలో వాట్సప్ మెసేజ్ వైరల్ చేశారని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారం వల్ల సిబ్బంది మానసికంగా ఇబ్బంది పడతారని..ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి తప్పుడు వార్తలను వైరల్ చేయవద్దని కోరారు.

పీఠాధిపతి అప్పలాచార్య మృతి

జగదాంబ: ఆధ్యాత్మిక లోకంలో అద్భుత సేవలు అందించిన అప్పలాచార్య పీఠాధిపతి సోమవారం స్వర్గస్తులయ్యారు. ఆయన మృతదేహాన్ని శిష్యులు, బంధువులు ఘనంగా పూజించి, అనంతరం సమాధి చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ నివాళులర్పించారు. అప్పలాచార్య పీఠాధిపతులు ఎంతో మంది భక్తులకు గురువుగా ఉంటూ, వారికి సరైన మార్గాలను చూపించారని ఆయన కొనియాడారు.

నిత్యం నరకం!

బీఆర్‌టీఎస్ డక్టుల్లో పేరుకు పోతున్న వ్యర్థాలు ■ మురుగు రోడ్డెక్కితే తప్పా స్పందించని అధికారులు ■ వర్షాకాలం మరింత ఇబ్బంది



బాజీ జంక్షన్‌లో డక్టుల్లో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: బీఆర్‌టీఎస్ రహదారిలో ఎక్కడికక్కడ కాల్వలు పొంగుతూనే ఉన్నాయి. రోడ్లమీద మురుగు ప్రవహిస్తూనే ఉంది. ఇక చిన్న వర్షం పడితే చాలు మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఇందుకు ప్రధాన కారణం బీఆర్‌టీఎస్ రోడ్డులోని డక్టులు వ్యర్థాలతో నిండి పోవడమే. వీటిని నిర్మించినపుడు నీరు ప్రవహించకుండా ఇసుక బస్తాలు వేశారు. నిర్మాణం పూర్తయిన తర్వాత చాలా చోట్ల వాటిని తొలగించలేదు. మరి



గోపాలపట్నం ప్రధాన రహదారి డక్టుల్లో వ్యర్థాలు

కొన్ని చోట్ల మ్యాన్ హోల్ కోసం ఏర్పాటు చేసిన కాలర్ ప్లేట్లకు మూతలు వేయలేదు. పగిలి పోయిన పలకలను మరమ్మతులు చేయడం మానేశారు. దీంతో వ్యర్థాలు భారీగా పేరుకు పోయి మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారాయి.

ఎప్పటికప్పుడు ఇబ్బందులు

ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నా శాశ్వత పరిష్కారం వైపు ఆలోచన చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో గోపాలపట్నం



బాజీ జంక్షన్ వద్ద పాడైన డక్టు పలక

ఖజానా జ్యూయలరీ దుకాణం వద్ద మురుగు నీరు రోడ్డపైకి ప్రవహించింది. ఇది ఎన్నో ఏళ్లుగా సాగుతున్నా పారిశుధ్య కార్మికులతో మేనేజ్ చేసేవారు. ఈ పరిస్థితి మితిమీరడంతో అధికారులు మేలుకొన్నారు. కొంత మేరకు డక్టుల్లో వ్యర్థాలను తొలగించారు. ఆ సమయంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు మాట్లాడుతూ గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు డక్టుల్లో వ్యర్థాలు స్పెల్ డ్రైవ్ ద్వారా తొలగిస్తామని తెలిపారు. ఆ తర్వాత అది కాస్తా అటకెక్కిపోయింది. అసలే వర్షాకాలం కావడంతో

పూర్తిస్థాయిలో వ్యర్థాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో నీరు రోడ్డెక్కితే అవస్థలు పడతామని వాపోతున్నారు.



బాజీ జంక్షన్‌లో..

ఇపుడు బాజీ జంక్షన్‌లో ఇదే సమస్య తలెత్తింది. దీని నుంచైనా అధికారులు పాఠాలు నేర్చుకుంటారో లేదో చూడాలి. ఇపుడు కూడా తూతూమంత్రంగా వ్యర్థాలు తొలగించి పనులు చాలించేస్తారా.. శాశ్వత ప్రాతిపదికన తొలగిస్తారా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ప్రధాన రహదారిలోని డక్టుల్లో వ్యర్థాలు తొలగించే పని చేపట్టాలని కోరుతున్నారు.



పనులను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు

కమిషనర్ అనుమతివ్వాలి

వ్యర్థాలు తొలగించే పనులు ఇంజినీరింగ్ డిపార్ట్ మెంట్ ద్వారా పెట్టాం. అంచనాలు వేసి జీవీఎంసీ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. అక్కడ అప్రూవల్ వస్తే డక్టుల్లో వ్యర్థాలు తొలగించడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుతానికి సమస్య లేకుండా వ్యర్థాలు తొలగిస్తున్నాం.

–బండారు అప్పలనాయుడు, ఏఎంహెచ్‌వో

ఎఫ్‌ఆర్‌యూను ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఆధీనంలో ఉన్న మల్కాపురం(శ్రీహరిపురం)లోని ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రిని ప్రైవేటుకు ఇవ్వవద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శ్రీహరిపురంలోని ఎఫ్ఆర్‌యూ ను 30 ఏళ్ల పాటు నిర్వహించడానికి కోరమాండల్ సంస్థకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని రద్దు చేసి, ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టి అనంతరం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు, మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్‌కి ఇవ్వొద్దంటూ డిమాండ్ చేశారు.



జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం లేకుండా ఈ ప్రతిపాదనలు ముందుకు తీసుకు రావడం చట్ట విరుద్ధమని, శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూను ప్రైవేట్ సంస్థకు ఇవ్వాలనే ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఎన్నికల ముందు కూటమి నేతలు, స్థానిక ఎమ్మెల్యే గణబాబు ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని అభివృద్ధి చేసి 24 గంటలు వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేట్‌కిచ్చి సామాన్య ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తే ప్రజాందోళన తప్పదని హెచ్చరించారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఆస్పత్రిని కొంతకాలం నుంచి నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ థియేటర్, ఎక్స్ రే యూనిట్, మెడికల్ ల్యాబ్‌లు మూసివేశారని, డెలివరీలు, శస్త్ర చికిత్సలు నిలిపివేశారన్నారు. హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, కోరమండల్, ఆంధ్రా పెట్రో కెమికల్ వంటి ప్రైవేట్ రంగ పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ కింద కనీసం రూ.20 కోట్లు సమీకరించి, ఆస్పత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చి, ఆరోగ్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎ.సత్యారావు, ఎస్.ఎస్.అప్పారావు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

- రూ. కోటితో వార్డులో బోర్ వెల్‌ల నిర్మాణాలు
- మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అవసరమైన చోట బోర్ వెల్ నిర్మాణాలు చేపడుతున్నట్లు నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చెప్పారు. వార్డు పరిధి గౌరీనగర్ రిక్షా కాలనీలో 120 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కోసం కొత్తగా మూడు బోర్‌వెల్స్ వేసే పనులను ఆయన సోమవారం ప్రారంభించారు.అలాగే లలితా డిలైట్ పార్క్, వనితా వాకింగ్ ట్రాక్, నవ్యాంధ్ర స్కూల్ వాకింగ్ ట్రాక్ , గౌతమబుద్ధ ధ్యానవనం, కరాస పార్క్ , కరాస హిందూ ముస్లిం క్రైస్తవ శ్మశాన వాటికలు , శాంతినగర్ పార్క్ వంటి చోట్ల బోర్ వెల్స్ పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఇందుకోసం సుమారు రూ. 1 కోటి వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పార్కుల్లో తాగునీటి సౌకర్యం కల్పించేలా శ్రద్ధ తీసుకున్నామన్నారు. వార్డులోని అన్ని కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతులు మెరుగు పరిచేలా అభివృద్ధి చేశామన్నారు. ప్రజావసరాల మేరకు భవిష్యత్‌లోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ సప్లై విభాగం ఏఈ సుమన్ , సిబ్బంది సన్యాసప్పారావు, వెంకటరమణ, కాలనీ వాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బోర్ వెల్ పనులు ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

జెడ్సీ రాము

మల్కాపురం: భారీ వర్షాల సమయంలో 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్ద గల పెద్ద గెడ్డ పొంగి రోడ్డుపైకి వరద నీరు వచ్చే సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జోన్- 5 జెడ్సీ బి.రాము చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఇక్కడ గెడ్డ పొంగి మురుగునీరు రోడ్డుపైకి వచ్చింది.దీనిపై పలు పత్రికలలో కథనాలు రావడంతో స్పందించిన జోన్-5 జెడ్సీ రాము సోమవారం మల్కాపురం మరిడిమాంబ కల్యాణపండం వద్ద గల గెడ్డను జీవీఎంసీ ఇంజినీరింగ్‌అధికారులు,సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. అక్కడ సమస్యను గుర్తించారు. పెద్ద కాలువ మలుపు వద్ద వ్యర్థాలు నిలిచిపోవడం వల్ల భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోయి రోడ్డుపైకి వస్తుందన్నారు. ఇక్కడ కాలువ ఎత్తు,వెడల్పు పెంచి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకి పాలిరెడ్డి,మజ్జి సోమేష్,సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న జోన్-5 జెడ్సీ రాము

'కొలిమి రాజెయ్యాల్సిందే' పుస్తకావిష్కరణ

సీతంపేట: అసమానతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని వివక్షపై పోరాటంగా చూడాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ పూర్వ సభ్యుడు ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పతివాడ నాస్తిక్ రచించిన 'కొలిమి రాజెయ్యాల్సిందే' అనే పుస్తకాన్ని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ సమాజంలో అసమానతలు పెరిగితేనే తిరుగుబాటు వస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న ఘర్షణ, నైరాశ్యం, వివక్షపై కవులు, రచయితలు లోతుగా విశ్లేషించి స్పందించాలని కోరారు. పతివాడ నాస్తిక్ రచించిన కవిత్వం శ్రీశ్రీని గుర్తుచేసిందన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ విమర్శనాత్మకమైన కవితలతో పుస్తకం అక్షరాల కొలిమిలా ఉందన్నారు. కవి రెడ్డి రామకృష్ణ పుస్తక సమీక్ష చేశారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ప్రవంతి ప్రధాన కార్యదర్శి చీకటి దివాకర్, అరసం విశాఖ అధ్యక్షుడు అడపా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, బసు పోతన తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వల్లూరు శివప్రసాద్, ఆచార్య చలం

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పెంపు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐ గాజువాకలో ప్రవేశాల గడువును ఈ నెల 15 నుంచి 20 వరకూ పెంచామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గడువు కూడా ఈ నెల 22 వరకూ పెంచామన్నారు. ఐటీఐలో 400 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటి వరకూ 2వ కౌన్సెలింగ్ కోసం 1594 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. అందులో 1122 మంది మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారని వివరించారు. మిగిలిన విద్యార్థులు కూడా తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

పెళ్లింట్లో చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

గాజువాక: షీలానగర్ ఏరియాలోని వెంకటేశ్వర కాలనీలో ఒక పెళ్లింట్లో చోటుచేసుకున్న భారీ దొంగతనం కేసులో గాజువాక క్రైం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీ జరిగిన అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తునకు కొంత మేర ఇబ్బంది తలెత్తినప్పటికీ పోలీసులు తమకు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఇతర అపార్ట్‌మెంట్లు, వాటిని అనుసంధానం చేసి ఉన్న రహదారుల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ముగ్గురు దొంగలు చోరీకి పాల్పడిన ఇంట్లో ఉన్న బ్యాగులోనే సొత్తు మొత్తాన్ని నింపుకొని వెళ్లిపోయినట్టు సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన సొత్తుతో నంబరు ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై దువ్వాడ రైల్వే స్టేషన్‌వైపు వెళ్లినట్టు భావిస్తున్నారు. క్రైం సీఐ కె.శ్రీనివాస్, ఎస్‌ఐ మన్మథరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లను సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

పీఎంఎఫ్‌బీవై పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట: రైతులకు వివిధ ఆర్థిక ప్రయోజనాలను అందించే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ, ఆగస్టు 15లోగా వరి పండించే రైతులు, కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ పథకంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. హెక్టారుకు రూ.1050, ఎకరానికి రూ.420 రైతులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రుణం తీసుకున్న రైతులకు 'ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ' ప్రీమియం చెల్లిస్తోందని గుర్తు చేశారు. ఈ పథకంలో చేరడం ద్వారా పంటకు బీమా పొందవచ్చని, రైతులు, కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

రూ.14 లక్షలతో హాకర్స్‌జోన్ మరమ్మతులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 2015లో సుమారు 30 షాపులతో కూడిన హాకర్స్ జోన్‌ను జీవీఎంసీ అధికారులు నిర్మించారు.అయితే ఈ షాపులు లోపల ఉన్నాయనే కారణంతో వ్యాపారులు అక్కడికి రాలేదు. దీంతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో కట్టిన ఈ హాకర్స్‌జోన్ నిరుపయోగంగా ఉండేది. దీంతో పలువురు అనాథలు, పిల్లలు నిర్లక్ష్యంగా విడిచిపెట్టిన వృద్ధులు ఇందులో ఆశ్రయంగా పొందేవారు.అయితే ప్రస్తుతం హాకర్స్ జోన్‌ను వినియోగంలోకి తేవాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా రూ.14 లక్షలతో మరమ్మతులతో పాటు ఇనుప గ్రిల్స్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా సోమవారం పనులు ప్రారంభించారు. అయితే ఇంత కాలం ఇక్కడ ఆశ్రయం పొందిన వారు రోడ్డున పడ్డారు. తమ లాంటి వారికి ఎక్కడో ఒకచోట ఆశ్రయం కల్పించాలని వారంతా కోరుతున్నారు.



హాకర్స్ జోన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు విస్తృతం

మల్కాపురం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఏయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డి.సింహాచలం అన్నారు. వివిధ జిల్లాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామీణ,పట్టణ,గిరిజన ప్రాంతాల యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు.మై భారత్ పోర్టల్‌లో వలంటీర్లంతా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జూలై, ఆగస్టులో కొత్త వలంటీర్లకు శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సింహాచలంను సత్కరిస్తున్న అధ్యాపకులు

పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం



అపరిశుభ్రంగా ఉన్న తరగతి గది

గోపాలపట్నం: యల్లపువాని పాలెం ఎంపీపీ పాఠశాల ఆవరణతో పాటు పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎంఈవోతో పాటు డీఈవోకు సోమవారం ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. గతంలో ఎంతో బాగున్న పాఠశాలను ప్రస్తుత హెచ్ఎం అధ్వానంగా మార్చారని ఆరోపించారు. ఇక్కడి పరిస్థితిపై ఆమెను అడిగేందుకు వెళ్లినా మాట్లాడేందుకు విముఖత చూపిస్తోందన్నారు. తరగతి గదులు దారుణంగా ఉన్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పిల్లల ఇబ్బందులు తొలగించి వారి భవిష్యత్తును బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మురళీనగర్: రక్తదానం ద్వారా మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అన్నారు. గైస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, లయన్స్ క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ వి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారికి మనం అందించే రక్తమే ప్రాణం నిలబెడుతుందన్నారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమంలో విద్యార్థులు ముందుకొచ్చి తనతో పాటు రక్తదానం చేయడంపై ఆయన అభినందించారు. పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రశంసించారు. కళాశాల ద్వారా సేకరించిన 39 యూనిట్ల రక్తాన్ని లయన్స్ క్లబ్‌కు అందించారు.



గైస్‌లో రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రమణ, విద్యార్థులు

రైల్వేస్టేషన్ బయట గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ బయట గల ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.... ఆదివారం మధ్యాహ్నం విశాఖ రైల్వేస్టేషన్ బయట గల ఆటోస్టాండ్ వద్ద సుమారు 35-40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి మరణించినట్లు ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడిని పరిశీలించారు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఈ వ్యక్తి గురించి వివరాలు తెలిసిన వారు ఫోర్త్ టౌన్ పోలీసులను స్వయంగా గానీ లేదా 94407 96012 నంబర్లలో తెలియజేయాలని కోరారు.



విశాఖ రైల్వేస్టేషన్ బయట ఆటోస్టాండ్ వద్ద వ్యక్తి మృతదేహం